# నేరస్థుడు

**లోడగల శ్రీ కృష్ణ**

**ఏదీ తనంతట తానుగా జరగదు: ఒక కారణం అంటూ ఉండి తీరాలని నమ్మతారు. కావచ్చు. కాని ఆ కారణమేదో తెలుసుకొనడానికి మాత్రం మనిషికి ఉన్న శక్తి సామర్థ్యాలు చాలవేమో అనిపిస్తుంది. ప్రపంచం పరికిస్తుంటే.**

**ఆదివారమని** బద్ధకంగా లేచి, కిటికీ తలుపులు రెండు తెరిచి, పక్కమీద కూర్చున్నాను. ఉదయారుణ కాంతులు బిలబిలావచ్చి నేలంతా పరుచుకుని గదిఅంతా ఒక్కసారిగా వెలిగించాయి. కైలాసాశ్రమం కొండ లోయలో మల్లెలవానలా మంచు ఇంకా కురుస్తూనే ఉంది. చల్లగా, హాయిగా పిల్ల తెమ్మెరలు సముద్రం మీదనుండి వీస్తూ, సర్వీచెట్లను కదిల్చి, ఉదయకాల సంగీతాన్ని వినిపిస్తున్నాయి. ఆ రాగోదయంలో ఉషాదేవి సుస్నాత అయి తిరిగి వెళ్లిపోబోతూ భూమిమీద ఇంత సిందూరాన్ని చల్లి మరీ పోయింది.

నేను ఉంటూన్న గదికి కొద్దిదూరంలో ఉన్న డాక్టరుగారి గార్డెన్ పారిజాతాల, మల్లెల పరిమళం నా గదిని, పరిసరాల్ని మత్తులో ముంచెత్తుతూంది. మాలతీ మాధవం పందిరికింద మందారాలు, గులాబీలు, చేమంతులు ఉదయకాంతుల్లో అందంగా విచ్చుకుని కన్నులపండుగ చేస్తూ, నా మనసును కూడా మధురమైన ఊహలతో నింపివేయసాగాయి.

అందంగా, ఆహ్లాదకరంగా వికసించే ఇట్లాంటి ఉదయాలను గదిలో కూర్చుని ప్రతిరోజు తిలకించడం గత నాలుగునెలలుగా నాకు అలవాటయిపోయింది.

బ్రతుకుతెరువుకోసం ఈ ఊరువచ్చిన కొత్తలో ఒంటరిగా, తోడునీడ లేకుండా గడపటం ఎట్లా? అన్న భయంతో దిగులు చెందేవాణ్ణి. నా ప్రకృతానికి, తత్వానికి సరిపడే పరిసరాలమధ్య ఇల్లు దొరుకుతుందో, లేదోనని కూడా భయపడ్డాను. కాని ఈ గదిలో దిగిన తరవాత నా అదృష్టాన్ని అభినందించుకోకుండా ఉండ లేకపోయాను. అదీకాకుండా నా పొరుగువారైన జైలు డాక్టరుగారు, కలెక్టరేటు బ్రహ్మచారి గుమస్తా, యూనివర్సిటీ లెక్చరరు — వీళ్లంతా కాస్తో కూస్తో సంస్కారం, సభ్యత, మంచితనము మూర్తీభవించిన వాళ్లే కావటంతో నాకే ఇబ్బంది కూడా లేకుండా పోయింది.

డాక్టరుగారికి జైల్లో ఉద్యోగం కావటం మూలాన తరుచు ఖైదీలు, ఖూనీలు—వీటినిగూర్చి కథలల్లి చెప్పేవారు. ఖైదీల జీవితగాథల్ని, వాళ్లందరు ఏ యే కారణాలచేత నేరస్థులయినది, వాళ్లలోని నేరప్రవృత్తిని తొలగించేందుకు ప్రభుత్వం ఎట్లాంటి చర్యలు తీసుకోవలసింది విడమరిచి చిన్నతరహా ఉపన్యాసాన్ని ఇచ్చేవారు. నేను దాన్ని విధిలేక, చేదుమందులా భరిస్తూ వచ్చాను; వస్తున్నాను.

"మాస్టారూ! ఇదిగో, మీ గులాబీ."

కలకలలాడుతూ వచ్చింది గీత; డాక్టరుగారి మూడవ అమ్మాయి. ఫస్టుఫారం చదువుతూంది. నా శిష్యురాలు. నేను చెప్పే చదువు ఒంటబట్టినా పట్టకపోయినా ఆ నెపంతోవచ్చి, నన్ను ఆటలు పట్టించడంమాత్రం ఆ పిల్లకు బాగా చాతనయింది. ప్రతి ఉదయం నాకొక అందమైన గులాబీ పువ్వు బహూకరిస్తూ నాకు మరీ ప్రేమపాత్రురాలయిపోయింది.

"నాన్నగారేం చేస్తున్నారమ్మా?"

"ఎవరో ఖైదీ చచ్చిపోయాడట! కబురువస్తే పొద్దున్నే లేచి వెళ్లారు. అదుగో నాన్నగారు!"

డాక్టరుగారు సరాసరి నా గదిలోకి వచ్చి కూర్చున్నారు. చిరునవ్వులు చిందిస్తూ, ఛలోక్తులు విసురుతూ గలగలమని వచ్చే ఆయనమొహం దించుకుని, నిశ్శబ్దంగా, నెమ్మదిగా నడిచిరావటం నాకాశ్చర్యం కలిగించింది. అంతేకాదు, గాఢమైన విషాదచ్ఛాయలు ముఖంలో అంతట ఆవరించుకొని ఉన్నాయి. మనసులోని ఆవేదన, ఉద్వేగము కళ్లల్లో స్పష్టంగా ప్రతిఫలిస్తున్నాయి.

మెడలోని స్టెతస్కోపు తీసి టేబిలుమీద ఉంచుతూ భారంగా నిట్టూర్చారాయన. ఆ తరవాత లేచి వెళ్లి కిటికీని ఆనుకొని, వెలుపలి దృశ్యాల్ని చూస్తూ నిలుచున్నారు.

"డాక్టర్!"

ఆయనకు నా పిలుపు వినిపించలేదు!

అచేతనంగా, అట్లాగే చూడసాగారు. ఆయన ఈ లోకంలో లేరనిపించింది.

అప్పటికి అరుణ కిరణాలు తెల్లనై, వెండివెలుగుల్లా గదిలోనే మరొకచోట ప్రతిఫలిస్తున్నాయి. ఇందాకటి అందం అంతా మరుగున పడిపోతూ, దానిస్థానే మేలుకుంటూన్న ప్రపంచపు రొదలో కలిసిపోయే స్వాభావికత, ప్రకృతిని స్వీకరించి వేసింది.

"మనిషిలో అసూయాద్వేషాలు, కాలుష్యం హృదయంలోనుండి పూర్తిగా చెరిగిపోయే రోజువస్తేతప్పించి, ఈ నేరాలు, నేరస్థుల సమస్యలు పరిష్కరించబడవని నా దృఢనమ్మకం!"

దూరంగా కనిపించే జైలు గోడలకేసి చూస్తూ అన్నారు డాక్టరుగారు.

ఇట్లాంటి ఉపోద్ఘాతాలు నా కలవాటే. అయినా ఈవేళ ఆయన చెప్పబోయేదానిలో ఏదో విశేషం ఉంటుందని ఆ కంఠాన్నిబట్టి ఊహించాను.

"అటు చూడు! ఆ ఎత్తైన, నల్లని గోడల వెనక, ఆ ఇనప కటకటాల నడుమ ఎందరు నిరపరాధులు, అమాయకులు న్యాయానికి, చట్టానికి తలఒగ్గి బలి అయిపోయారో ఊహించగలవా? నేరం, న్యాయం—వీటిని గూర్చి ఆలోచించేముందు వాటి వెనక పురులువిప్పిన నేరప్రవృత్తిని, హృదయ దౌర్బల్యాన్ని గుర్తించడం చాలా అవసరం. అలా జరగనంతకాలం ఏ నేరస్థుణ్ణి శిక్షించే అధికారం ఏ చట్టానికి, ప్రభుత్వానికి లేదు!" డాక్టరుగారు ఆగారు.

నేను లేచివెళ్లి జైలువేపు దృష్టి సారించాను.

నా గదికి ఎడంవేపుగా, కనుచూపుదూరంలో జైలు గోడలు,వాటి నానుకుని శ్మశానవాటిక ఉన్నాయి.నల్లగా, చిక్కని నిశీథినిలా ఉన్న ఆ రంగు, ఆ గోడలకు ఎవరు నిర్ణయించారో గాని, చూసేవాళ్ల గుండెల్ని కదిలించివేస్తుంది. చాలాకాలానికిగాని, దానిని మరిచిపోలేరు. వాటి పక్కనే జిల్లేడు చెట్లతోను, వెంపలి తుప్పలతోను నిండి, జీమూతంలా ఉన్న చిన్న ప్రహారీ గోడ మధ్య శ్మశానవాటిక ఉంది. జైల్లో మృతిచెందిన ఖైదీల నందర్నీ అక్కడే దహనం చేస్తారు.

స్వాభావికంగా, సహజంగా తనువు చాలించిన వారెవరిని బహుశః అక్కడికి తీసుకువచ్చి ఉండరు! ఆవేశాలకు, క్షణికోద్రేకాలకు లొంగిపోయి దారుణకృత్యాలకు ఒడిగట్టినవారు; ఆకలిబాధతో, దారిద్ర్యంతో విసిగిపోయి అఘాయిత్యానికి తలపడినవారు; జీవితంమీద రోసి ఆత్మహత్యలకు పాల్పడినవారు—వారి అంత్యక్రియలు మాత్రమే అక్కడ నిర్వహింపబడుతూ ఉంటాయని డాక్టరుగారు ఒకసారి చెప్పారు!

"నీలకంఠం చచ్చిపోయాడోయ్!"

"ఎవరు?"

"నువ్వు రోజు అతని పాటలు విని మెచ్చుకుంటూ ఉంటావుగా? అతను. నాలుగైదు రోజులుగా ఆహారం తీసుకోవడం మానివేశాడు. అందరం ఎంతగా ప్రయత్నించినా అతనిచేత తినిపించలేకపోయాము. ఆఖరికి జైలు సూపరింటెండెంటు కూడా ప్రయత్నించి విసుగెత్తి ఊరుకున్నారు. నిన్న పరిస్థితి మరీ విషమించింది. అసలే తీవ్రమైన మనోవ్యథతో బాధపడేవాడు. దానితోపాటు ఆహారంకూడా లేకపోవడంవల్ల మరీ నీరసించిపోయాడు. రాత్రి రెండు, మూడు గంటల ప్రాంతంలో మరణించాడు. ఒకవిధంగా నీలకంఠం ఆత్మహత్య చేసుకున్నాడని నా అనుమానం."

ఆఖరి మాటలు అంటూండగా డాక్టరుగారి కంఠం దుఃఖంతో జీరపోయింది!

నీలకంఠంతో నాకు ప్రత్యక్షంగా ఎక్కువ పరిచయం లేకపోయినా, అతని పాటలు, ప్రార్థనగీతాలు నాకు సుపరిచితాలు. ప్రతి ఉదయం అయిదుగంటల ప్రాంతంలో అతను తన 'సెల్' లోపలినుండే పాడేవాడు. ఆ పాటలు స్పష్టంగా వినడానికి ఒకొక్కసారి జైలువద్దకు నడిచి వెళ్లేవాణ్ణి. అతని కంఠంలోనే కాకుండా, ఆ పాటలలో కూడా ఎంతో గంభీరత, నవ్యత నిండి ఉండేవి. అతను ప్రతి ఉదయం శ్రావ్యంగా, గంభీరంగా గొంతెత్తి పాడుతూ ఉంటే, జైలు ఆవరణ అంతా మారుమ్రోగేది. గాఢ సుషుప్తినుండి లోకం మేలుకునే ఆ ప్రశాంత సమయంలో అతని గొంతు చాలా అపూర్వంగా ప్రతిధ్వనించేది. ప్రతి దినము అతను పాడేవి ప్రార్థనగీతాలే కావటంవల్ల, అతనిమీద ఉన్న సదభిప్రాయంచేత, జైలు అధికారులు కూడా అతని ఆ దినకృత్యానికి అభ్యంతరం చెప్పేవారు కారు.

ఒకటి రెండుసారులు డాక్టరుగారితో వెళ్లి నీలకంఠాన్ని చూచివచ్చాను. మొదటిసారిగా చూసినప్పుడు మాత్రం అడివిలో ఆడుతూ పాడుతూ తిరిగే



# నేరస్థుడు

కోయిలను పట్టి తెచ్చి ఈ ఇనప కటకటాల మధ్య బంధించారనిపించింది. ఎక్కువగా ఎవ్వరితోను మాట్లాడేవాడు కాదు. రోజంతా తన 'సెల్'లోపలే కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తూ, అంతరాంతరాలలోని స్మృతులను నెమరు వేస్తున్నట్లు కనిపించేవాడు. జీవిత జ్వాలల్లోపడి మండిపోయిన విషాద స్మృతుల చారలు అతని మొహంనిండా ఆవరించుకొని ఉండేవి. వీటి అన్నింటికన్నా నాకు అమితంగా ఆశ్చర్యం కలిగించినవి అతని కళ్ళు. నిత్యం ఎర్రగా, అగ్నిగోళాల్లా కదలాడే ఆ కళ్ళలో అతని అంతర్యంలోని ఆవేదన, అనిశ్చితత, బ్రతుకులోని నైరాశ్యము—అన్నీ కొట్టవచ్చినట్లు కనిపించేవి. అంతర్యంలో నిత్యం అగ్నిగోళాలు పగులుతూ ఉన్నట్లు కనిపించే ఈ వ్యక్తి, ప్రతి ఉదయం హాయిగా, శ్రావ్యంగా ప్రార్థన గీతాలు ఎట్లా పాడగలుగుతున్నాడా? అని నాలో నేనే ఆశ్చర్యపోయేవాణ్ని.

"నీలకంఠం జీవితాన్ని గూర్చి మీరు ఎప్పుడయినా అడిగారా, డాక్టర్?"

"లేదు."

"ప్రతి ఖైదీయెడల అత్యంత కుతూహలం కనబరిచే మీరు నీలకంఠం గాథ తెలుసుకోలేకపోవడం, విచిత్రంగా ఉంది!"

"తెలుసుకునే అవసరం లేకపోయింది. అయినా ఆతని చరిత్ర నాకు బాగా తెలుసు. అతను మా ఊరివాడే!"

నిజంగా నీలకంఠాన్ని గూర్చి డాక్టరుగారికి బాగా తెలుసుననే అనిపించింది. ఖైదీలు అందరి గాథల్ని అత్యంతాసక్తితో చెప్పే ఆయన, ఈ వ్యక్తిని గూర్చి ఇంతవరకు ఎందుకని చెప్పలేదో తెలుసుకోవాలన్న ఉత్సుకత నాలో రేగింది.

"అప్పుడప్పుడు నీలకంఠం ప్రసక్తి వచ్చినాసరే, అతన్ని గూర్చి ఎప్పుడు ఏమీ చెప్పలేదు మీరు! ఆ కారణంచేత అతని జీవితంతో ఏదో గొప్ప విశేషమే ముడిపడి ఉంటుందని నేను ఊహించటం పొరపాటు కాదనుకుంటాను" అన్నాను.

డాక్టరుగారు నావైపు ఒకసారి సూటిగా చూశారు. ఆ తరవాత నెమ్మదిగా కిటికీ దగ్గిరికి కుర్చీ లాక్కుంటూ, "నీకు అతని గాథ వినాలని ఉందికదూ? నిజమే, ఇంత కాలం ఉపేక్షించటం నా పొరపాటే. కాని ఈవేళ అతను ఈ లోకంనుండి నిష్క్రమించాడు కనక చెప్పినా ఫరవాలేదు. విను" అన్నారు.

జైల్లో ఏడుగంటలయిందని సూచిస్తూ భేరీనాదం వినిపించింది. దానితోపాటే 'ప్రేమసమాజం' ప్రార్థనా మందిరంనుండి ఉపయార్చనా సూచనగా శంఖారావం, ఆ పిదప శ్రావ్యంగా మంద్రస్థాయిలో ఆశ్రమవాసుల భజనగీతాలు వినిపించసాగాయి. "ఒకవైపు, లోకంలోని కారుణ్యాన్ని అంతా హృదయాల్లో నింపుకుని, తోడి మానవునికి సేవ చేయడమే జీవిత పరమావధిగా తలిచే ఆశ్రమవాసుల శంఖారావము, మరొకవంక తోటి మానవుణ్ని దోచుకుని, హత్యలు చేసి, ఆ వెచ్చని నెత్తురుతో తమ పొట్టలు నింపుకోవాలనుకునే రాక్షసులు, ఆవేశాలకు, క్షణికోద్రేకాలకు లొంగిపోయి, నైతిక పతనం చెందిన నేరస్థులు పూరించిన భేరీనాదము! ఈ రెండు కలిసి, ఒకేసారి మోగి, ప్రతిధ్వనించి లోకాన్ని మేలుకొలపటం విచిత్రంగా ఉంది కాదుటోయ్? ప్రపంచంలోను, మానవహృదయాల్లోను ఈ ద్వైవిధీభావాన్ని భగవంతుడు ఎందుకు సృష్టించాడా? అని చాలా సార్లు నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. కాని ఇంతవరకు దానికి సమాధానం దొరకలేదు. కాని ఆ భావంవల్ల మనిషి జీవితం ఎన్ని వక్రగతుల్లో పయనిస్తుందో మాత్రం ప్రత్యక్షంగా కొన్నిచోట్ల చూడగలిగాను. అట్లా వక్రించిన జీవితమే నీలకంఠానిది!

"నీలకంఠం విషయం చెప్పేముందు ఉషను

సూర్చి చెప్పటం అవసరం. జీవితాన్ని తనకు వాలుగా మలుచుకోవటం చేతగాక, జీవితం ఎటు లాగితే అటు పేగిపోయి, చేతులార నాశనాన్ని కొని తెచ్చుకున్న స్త్రీలలో ఉష ఒకతె.

"అదే మల్లెపువ్వు అందాన్ని, గులాబిరేకల లావణ్యాన్ని గుర్తుకు తెస్తూ, సప్తవర్ణాలతో విరుచుకునే ఇంద్రధనుస్సులా ఆమె, ఆ రోజుల్లో ఊళ్లో అందరి దృష్టి ఆకర్షించగలిగిందంటే ఆశ్చర్యంలేదు. ఉష నడుస్తూ ఉంటే, ఆ దారిలో అందరు చూస్తూ ఉండేది!"

"ఎవరామె?"

"నీలకంఠం భార్య! ఆమె సౌందర్యానికి, అపూర్వమైన లావణ్యానికి ఊళ్లో చాలామంది ఆకర్షితులైనా, ఆమెను గాఢంగా వాంఛించి, తమది కావాలని అనుకున్నవాళ్లు బహు కొద్దిమంది. ఆమెను ఎవరికి వారే గగన కుసుమంగా ఊహించుకోవడము, అరి భయంకరుడైన ఆ ఊరి కరణంగారి ఏకైక పుత్రికా రత్నం కావడము దానికి కారణాలు!

"గలగలమని సెలయేరులా పారే ఆమె సౌందర్యానికి, స్త్రీత్వపు లావణ్యానికి అమితంగా ఆకర్షితుడుకావటమే కాకుండా, ఆమెను గాఢంగా వాంఛించి పొందగలిగాడు నీలకంఠం. ప్రేమకు, మోహానికి, వాంఛలకు ఏదైనా అవినాభావ సంబంధం తీవ్రంగా పెనవేసుకుని ఉన్నదంటే, అది ఒక్క నీలకంఠం విషయంలోనే ప్రత్యక్షంగా చూడగలిగాను!

"అతను తన ప్రాణానికి ప్రాణంగా, హృదయానికి హృదయంగా ఉషను ప్రేమించాడు. తన హృదయ సీమలో మహారాజ్ఞిగా, ఆరాధ్యదేవతగా ఉన్నత పీఠంపై నిలిపి అర్చించేవాడు. ఉషను తనదానిని చేసుకుని, భార్యగా పొందాలని అహోరాత్రాలు పరితపించాడు నీలకంఠం.

"ఉషకూడ అతన్ని ప్రేమించింది. అతనినిజాయితీకి, ప్రేమకు పూర్తిగా వశమైపోయి అతనితోనే తన జీవితాన్ని పెనవేసుకుంది. భర్తగా, ప్రియుడుగా, త్రికరణశుద్ధిగా నీలకంఠాన్నే వాంఛించింది! కాని...." డాక్టరుగారు ఆగిపోయి భారంగా నిశ్వసించారు. ఆంతర్యంలో చెప్పరానిదేదో కలయదిరిగినట్లు నిట్టూరుస్తూ, నేరస్థుడు నేరంచేసిన తరవాత న్యాయమూర్తి ముందు నిలుచున్నట్లు, తన్ను తానే నిందొక్కుకోవడానికి విశ్వ ప్రయత్నం చేయసాగారు.

"ఇంతగా చెబుతున్నారు—ఉషతో మీకు బాగా పరిచయం ఉందా, డాక్టర్?"

నా ప్రశ్న విని ఆయన నవ్వారు. జీవంలేని నవ్వు. ఎదురుగా చితిమండుతూంటే, వేదాంతి నవ్వే నవ్వు!

"ఉషకు నీలకంఠంతో పెళ్లికావడానికి ముందు, ఒక యువకుడితో పరిచయం ఉండేది. ఊళ్లో వాళ్ల ఇద్దరి స్నేహాన్ని ఊహించడానికి కూడా ఆస్కారం లేకుండా అతిరహస్యంగా కలుసుకునేవాళ్లు. తొలి యౌవన రాగోదయంలో వికసించే తీయని అనుభవాలకోసం, వాళ్ల పరిచయం కొత్తపుంతలు తొక్కింది. అది ప్రేమో కాదో ఇదమిత్థంగా తేల్చి చెప్పలేని అయోమయంలో పడిపోయారు వాళ్లు. తాము ఏం చేస్తున్నది, దాని ఫలితాలు—ఏ కోశాన ఆలోచించే వ్యవధి కూడా వాళ్లకి లేకపోయింది. అట్లా ఆలోచించగలిగే సమయానికి వాళ్లిద్దరు విడిపోవటం కూడా జరిగింది.



సాంధ్యశోభి

ఫోటో—ఎల్. ఆర్. గ్రోవర్ (రోహతక్)

ఆ యువకుడు పెద్ద చదువులకని పట్నం వెళ్లి పోయాడు. ఆ తరవాత కొన్నాళ్లకి నీలకంఠం ఉష జీవితంలో ప్రవేశించాడు.

"అప్పటి కామె మూడవనెల గర్భవతి.

"నీలకంఠానికి తరవాత ఈ సంగతి తెలిసినా కూడా ఆమెను పల్లెత్తు మాట అనలేదు. పైగా ఆ పుట్టబోయే బిడ్డకు తానే తండ్రినని బహిరంగంగా ఒప్పుకున్నాడు.

"ఆరు నెలలు తిరగకుండానే ఉష ఆడబిడ్డను ప్రసవించింది. భార్యమీద ఎంత ప్రేమ ఉన్నా, ఆ పుట్టిన బిడ్డవంకమాత్రం తేరిపార చూడలేకపోయేవాడు నీలకంఠం. ఆ పిల్లను చూస్తూంటే తన ఒళ్లంతా తేళ్లు, జెర్రులు పాకుతూన్నట్లు బాధపడేవాడు, ఆ పిల్ల పాకినా, పదలాడినా, ఏదో ప్రబల శత్రువు తన కళ్లముందు తిరుగాడుతూన్నట్లు వ్యథచెందేవాడు!

"ఇంత జరిగినా అతను, ఒక్కనాడు ఉషనుగూర్చి నోరు మెదపలేదు. ఆమెమీది ప్రేమ, అనురాగము లేశమైనా తగ్గలేదు. ఎప్పటిలాగే ఆమెను ప్రాణప్రదంగా చూసుకుంటూండేవాడు.

"ఉషకు రెండోసారి మళ్లీ ఆడపిల్లే పుట్టింది. ఈసారి పుట్టిన బిడ్డను ఆప్యాయంగా తీసుకుని గుండెలకి అదుముకున్నాడు. తన బిడ్డ, తన రక్తం

పంచుకుని పుట్టిన బిడ్డ! అనే గర్వం, సంతోషం ఆతని కళ్లలో, మొహంలో అంతట వెల్లివిరిసింది. ఆ బిడ్డను, ఉషను అక్కున జేర్చుకుని ఎంతగానో మురిసిపోయేవాడు.

"తన బిడ్డమీది మమతతో మక్కువతోబాటు, పెద్ద పిల్లమీద ఏవగింపుకూడా ఆతనిలో ఎక్కువ కాజొచ్చింది. ఆ పిల్ల నిత్యం తన కళ్లముందు తిరుగుతూ, తన భార్య ఒకప్పటి పతనాన్ని, చపలత్వాన్ని ఎత్తి చూపుతున్నట్లు బాధపడేవాడు.

"ఒకటి రెండుసార్లు ఆ పిల్లను ఏ శరణాలయంలోనో, ఏ పిల్లల హాస్టలులోనో చేర్పిస్తే బాగుంటుందని భార్యతో అన్నాడు కాని ఉష దానిని పూర్తిగా వ్యతిరేకించింది. తన బిడ్డను తననుండి వేరుచేయడానికి ఆమె సుతరాము ఇష్టపడలేదు. దానితో ఆ పిల్లమీది ద్వేషము, క్రోధము, ఏవగింపు రోజురోజుకి మరింతగా ఎక్కువై, చివరికి ఆమెను తన కళ్లముందు కనిపించకుండా చేయాలన్న దృఢనిశ్చయానికి వచ్చేసి, దాని కోసం మార్గాలు వెదకసాగాడు.

"ఆరోజు రాత్రి! నీలకంఠం జీవితాన్ని, ఉష హృదయాన్ని తీవ్రంగా కలచివేసి, వాళ్ల కాపురాన్ని ఛిన్నాభిన్నం చేసిన రాత్రి అది!

"మామూలుగా ప్రతిరోజు పెద్దపిల్లను ఉష, రెండవ బిడ్డను నీలకంఠం, తమ పక్కల్లో వేసుకుని పడుకోవటం అలవాటు. ఆరోజుమాత్రం పెద్దపిల్లను తనదగ్గిర పడుకోబెట్టుకున్నాడు నీలకంఠం. పగలంతా ఆ పిల్లమీద ఎన్నడూలేని ప్రేమకురిపించి, మచ్చిక చేసుకున్నాడు. ఉష కూడా ఆ మార్పుకి చాలా సంతోషించింది.

"ఆ రాత్రి ఏం జరిగిందో ఎవ్వరికీ తెలియదు. ఉదయం లేచి చూచేసరికి పెద్దపిల్ల మామూలుగా వాళ్లమ్మ పక్కలోనికే చేరి హాయిగా నిద్రపోతూ ఉంది. చిన్నబిడ్డ నీలకంఠం పక్కమీదనే, ఎప్పటికీ తొలగని దీర్ఘనిద్రలో మునిగిపోయి ఉంది.

"తన బిడ్డను, తన కులమునుండి, తన ప్రేమను, హృదయాన్ని, రక్తాన్ని పంచుకుని పుట్టిన బిడ్డను, తన చేతులలోనే విషంఇచ్చి చంపానని తెలుసుకున్న నీలకంఠం, ఆ పాపాన్ని కోర్టులో బహిరంగంగా ఒప్పుకున్నాడు! అతను జైలుకువెళ్లాక ఉష పిచ్చిదైపోయి వాల్తేరు హాస్పిటల్లో చేర్చబడింది."

"ఇందర్ని పొగొట్టుకుని ఆ పెద్దపిల్ల ఇంకా బ్రతికే ఉందా, డాక్టర్?"

"ఉంది! నా దగ్గిరే! మా పెద్దమ్మాయి విజయ, ఉష కూతురే!"

డాక్టరుగారు లేచి నిలుచున్నారు.

శ్మశాన వాటికలో చితి ముట్టించారు. నెమ్మదిగా మంటలు ఆకాశంవేపు ఎగబడుతున్నాయి. నేను డాక్టరుగారి స్టెతస్కోపు ఆయన చేతికి అందిస్తూ అడిగాను: "ఒక్క విషయం, డాక్టర్! దీనికంతకి కారణభూతుడైన ఉష మొదటి ప్రియుడు ఎవరో మీకు తెలుసా?"

నా ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పలేదు. భగభగ మండే ఆ చితికేసి చూస్తూ, "హే భగవాన్! నన్ను క్షమించు!" అని రుద్ధకంఠంతో పలికి, భారంగా అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయాడు.

చితి ఇంకా మండుతూనే ఉంది. ★




